క్లుప్తంగా

కార్మికులకు పీపీఈ కిట్లు పంపిణీ



తెనాలిఅర్బన్: స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ వారు తెనాలి మున్సిపల్ పారిశుద్ధ్య విభాగంలో పని చేస్తున్న ఎనిమిది మంది కార్మికులకు పంపిన తొమ్మిది రకాల పీపీఈ కిట్లను గురువారం చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్నలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్నలు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కిట్లు, మాస్కులు, ప్రత్యేక డ్రస్సు, గ్లౌజులు, షూలు ప్రభుత్వం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వీటిని ధరించి పారిశుద్ధ్య నిర్వహణ చేయడం వలన అనారోగ్య సమస్యలు దరిచేరవని చెప్పారు. అందరూ వీటిని ధరించాలని సూచించారు. ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, పలువురు మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌కు సహకరించండి

అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో జరుగుతున్న హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌కు అందరూ సహకరించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి సూచించారు. పట్టణంలో 15, 25,26 వార్డులలో గురువారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న చెత్త సేకరణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం సచివాలయంలో ఉద్యోగులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ప్రతి అర్జీని పరిశీలించి త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

పరమేశ్వరుడికి అన్నాభిషేకం



తెనాలి: పవిత్ర కార్తీకమాసం పురస్కరించుకుని స్థానిక గంగానమ్మపేటలోని చారిత్రక ప్రాముఖ్యత కలిగిన శ్రీపర్వతవర్ధినీ సమేత శ్రీరామేశ్వరస్వామి దేవస్థానంలో పరమేశ్వరుడికి గురువారం అన్నాభిషేకం నిర్వహించారు. పట్టణానికి చెందిన పెసర్లంక వెంకటరమణ, కల్పన దంపతుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తట్టుకుళ్ల అశోక్‌యాదవ్, జలగం రామకృష్ణ, కుర్రా శ్రీను, ధర్మేంద్ర, చిట్టిబాబు, నాగేశ్వరరావు, ఆలయ ఈవో వీవీ రమణకుమారి, అర్చకులు పాల్గొన్నారు.

మూడు నెలలకు కూడా పింఛన్ తీసుకోవచ్చు

ఎంపీడీఓ వి.విజయలక్ష్మి

కొల్లిపర: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి నెల పెన్షన్ తీసుకునే లబ్ధిదారులు అనివార్య కారణాల వలన రెండు నెలలు వరకు పింఛన్ తీసుకోలేక ఉన్నవారు మూడవ నెలలో పింఛన్ తీసుకునే వెలుసుబాటు ఇకనుంచి కలిప్రించిందని ఎంపీడీఓ వి.విజయలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు వరుసగా రెండు నెలలు తీసుకోకపోతే మూడో నెలలో లబ్ధిదారుని పింఛను కనిపించేది కాదని ఇకనుంచి రెండు నెలలు తీసుకోకపోయినా మూడవ నెలలో రెండు నెలలు కలిపి మూడు నెలల పింఛన్ సొమ్మును తీసుకోవచ్చని తెలిపారు. మూడు నెలలు దాటితే పెన్షన్ జాబితాలో వారి పేరు కంప్యూటర్ ద్వారా లాక్ చేయడం జరుగుతుందని తెలిపారు. పెన్షన్‌దారులు తప్పని పరిస్థితుల్లో మాత్రమే ఈ విధంగా పెన్షన్ తీసుకోవాలని సూచించారు.

ప్రత్యేక ఓటరు క్యాంపులు

మంగళగిరి: నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 23, 24 తేదీల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు మంగళగిరి నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎ.లక్ష్మీకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్ల జాబితాను ఓటర్లు పరిశీలించుకుని స్థానిక బీఎల్వోల ద్వారా సవరణలు చేయించుకోవాలన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్వోలు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే 18 ఏళ్లు నిండిన వారు ఓటరు నమోదు చేసుకోవచ్చని చెప్పారు.

పాము కాటు రక్షణపై అవగాహన

మంగళగిరి రైతులు వ్యవసాయ పనుల్లో పాములు పట్ల అప్రమత్తంగా ఉండాలని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ విద్యార్థులు సూచించారు. నూతక్కి రైతులకు గురువారం అవగాహన కల్పించారు. విషపూరిత పాము కాటేస్తే వెంటనే వైద్యుని వద్ద చికిత్స తీసుకోవాలన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు ఇంటింటికి తిరిగి రైతులకు పాము కాటు రక్షణపై అవగాహన కల్పించారు.

మిషన్ల కోత..పశుగ్రాసానికి కొరత

- పశువుల పెంపకం భారమంటున్న రైతులు
- నానాటికీ తగ్గుతున్న పశువులు పెంపకం



మిషన్ ద్వారా కోతలు కోసిన తరువాత వరి గడ్డిని తగలబెట్టిన దృశ్యం



మండలంలో యంత్రంతో కోతలు నిర్వహిస్తున్న దృశ్యం

కొల్లిపర: వరికోత మిషన్ల వల్ల పశుగ్రాసం కొరత తీవ్రమౌతోంది. పశువుల పెంపకం రైతులకు భారంగా మారడంతో ఉన్న వాటిని తెగనమ్ముకుంటున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. నియోజకవర్గంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో సుమారు 32 వేల ఎకరాలు రైతులు వరి సాగు చేస్తున్నారు. కూలీల కొరత, పెట్టుబడులు ఎక్కువ ఉండటంతో నేరుగా మిషన్లు పెట్టి వరికోతలు కోయించడంతో వరిగడ్డి కొరత అధికమైంది. దీంతో గ్రాసం అందక, అధిక రేట్లకు గడ్డి కొనుగోలు చేయలేక ఉన్న పశువులను రైతులు అమ్మేస్తున్నారు.

వరి ఎకరాకు 30నుంచి 35 బస్తాల వరకు దిగుబడి వస్తుంది. వరి కోతలు మిషన్ ద్వారా గంటకి రూ.2,500 నుంచి రూ. 3000 వరకూ కిరాయి తీసుకుంటున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీల కొరత, ఖర్చు అధికంగా ఉండటం వల్ల ఎక్కువ మంది రైతులు మిషన్లను ఆశ్రయిస్తున్నారు. అదే కూలీల చేత కోతలు కోయించి ఆర బెట్టి, కుప్పలు వేసి, తరువాత నూర్పిళ్లు చేయడం వల్ల ఖర్చులు సుమారు ఎకరానికి 12 వేలు వరకు అధికంగా అవుతున్నాయని, పెట్టిన పెట్టుబడులు రావడంలేదని పశుగ్రాసం మాత్రమే మిగులుతుందని అంటున్నారు. అందువల్ల పశుగ్రాసం కొరత వచ్చినా రైతులు దిగుబడులు కోసం పశుగ్రాసాన్ని పంట చేలోనే నిప్పు పెడుతున్నారు.

పొరుగు జిల్లాల నుంచి దిగుమతి



మిషన్ తో వరి కోయటం వలన గడ్డి ముక్కలుగా ఉన్న దృశ్యం

ఈ ప్రాంతంలో ఎక్కువ మంది రైతులు యంత్రాల ద్వారా వరి కోతలు నిర్వహించటం, అనంతరం వచ్చిన గుల్ల చెత్తను తగలబెట్టం వలన పశుగ్రాసం కొరత అధికమైంది. దీంతో కృష్ణాజిల్లాలో పెద్ద ఓగిరాల, నంబూరు, ఉయ్యూరు నుంచి వరిగడ్డిని దిగుమతి చేసుకుంటున్నారు. గడ్డి ట్రాక్టర్ రూ.7 వేల నుంచి రూ.8 వేల వరకూ పలుకుతోంది. గత నాలుగేళ్లలో వరికోత మిషన్ల వల్ల గ్రామాల్లో పశు సంపద గణనీయంగా తగ్గిందని పశు వైద్యాధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పాల ఉత్పత్తిదారులకు సబ్సిడీపై పశువులు, దాణా, పశుగ్రాసాన్ని అందించి గ్రామీణ ప్రాంతాల రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

రాబోయే రోజుల్లో పాలకు ఇబ్బంది



ప్రభుత్వం రైతులకు పశుగ్రాసాన్ని సబ్సిడీపై అందిస్తే పశువుల పెంపకం జరుగుతుంది. లేకుంటే రాబోయే రోజుల్లో పాలకు తీవ్ర ఇబ్బందులు పడతాం. ట్రాక్టర్ గడ్డి రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు చెప్పటంతో కొనుగోలు చేయలేని పరిస్థితి ప్రస్తుతం నెలకొంది.

–ఎం. సుధీర్ బాబు, పిడపర్రు, పాడి రైతు

కూలీలు రావడం లేదు



కూలీలు కొరతతో మిషన్లు ఆశ్రయిస్తున్నాం. దీనికి తోడు అధికంగా కూలీ అడగటంతో చేసేది లేక సన్న ,చిన్నకారు రైతులతో సహా మిషన్లపై ఆధారపడాల్సి వస్తోంది. దీనివల్ల పశువులకు గ్రాసం లభించడం కష్టమవుతోంది. గడ్డి కొనుగోలు చేసి వాటిని మేపే స్థితి మాకు ఉండటం లేదు

–ఎ.వెంకటరెడ్డి , తూములూరు, రైతు

వంతెన నిర్మాణానికి ప్రణాళికలు



అన్నవరపులంక వద్ద కృష్ణానదిపై వంతెన నిర్మాణ సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్న అధికారులు

కొల్లిపర: మండల పరిధిలోని అన్నవరపు లంక గ్రామానికి ప్రజలు కృష్ణానదిలో నుంచి వెళ్లాల్సి ఉంది. ఈక్రమంలో కృష్ణా నదికి వరదలు వచ్చిన సమయంలో మండలంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయ పనులు, వ్యాపారాలు ముగించుకొని గ్రామస్తులు పడవల ద్వారా గ్రామంలోకి రాకపోకలు చేస్తుంటారు. వరదలు సమయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుండడంతో ప్రజలు ఇటీవల వచ్చిన వరదలు సమయంలో కేంద్ర మంత్రి, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌లు గ్రామంలో పర్యటించినప్పుడు వంతెన నిర్మాణం ఆవశ్యకతను వివరించారు. దీంతో వారు స్పందించి వంతెన నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో గురువారం ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు వంతెన నిర్మాణం కోసం కృష్ణానది కరకట్ట నుంచి నదిలో అన్నవరపు లంక గ్రామం వరకు రూ.70 కోట్ల వ్యయంతో వంతెన నిర్మాణం కోసం ప్రణాళికలు పరిశీలించారు. ఎక్కడ నుంచి ఎక్కడవరకు వంతెన నిర్మాణం జరగాలి, ఏ విధంగా నిర్మాణ పనులు చేపట్టాలి, ఎంత మేరకు ఖర్చు అవుతుంది అన్న విషయాలను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మృత్యుంబాబు, పంచాయతీరాజ్ డీఈ ఎం.కృష్ణారెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈలు, బి.కిషోర్‌రెడ్డి, అవుతు సాంబిరెడ్డి, వరంగల్ యూరివర్సిటీ ప్రొఫెసర్ శంకర్, సాయిల్‌టెస్ట్ డిజైనర్ నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

26న గుంటూరులో బహిరంగ సభ



ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం

తెనాలి: కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న గుంటూరులో జరగనున్న ర్యాలీ, సభను జయప్రదం చేయాలని స్థానిక చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశం విజ్ఞప్తి చేసింది. వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి సీఐటీయూ తెనాలి డివిజన్ కమిటీ కార్యదర్శి షేక్ హుస్సేన్‌వలి అధ్యక్షత వహించారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేక ప్రస్తుతం చేతికందిన పంట కారు చౌకగా అమ్ముకోవలసిన పరిస్థితి దాపురించిందని చెప్పారు. సీఐటీయూ జిల్లా నాయకుడు బాబూప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదార్లకు అనుకూలంగా నిర్ణయాలు చేస్తున్నదని, కార్మిక వర్గానికి ఎటువంటి హక్కులు లేకుండా యాజమాన్యం దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పర్మినెంట్ ఉద్యోగాలు లేవనీ, కనీస వేతనాలు అమలు చేయటం లేదనీ, పన్నెండేళ్లుగా కోట్లాది మంది కార్మికులకు వేతనాలలో ఎదుగుదల లేక, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు లేక అప్పులపాలవుతున్నట్లు చెప్పారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ఆదేశాలు ఇచ్చినా వాటిని అమలు చేయటం లేదన్నారు. ఏఐటీయూసీ నాయకుడు ఎస్.గురుబ్రహ్మం మాట్లాడుతూ విద్యుత్ సవరణ చట్టం అమల్లోకి రాకుండా చూడాలని కోరారు. మాగంటి యలమందయ్య, ఎం.సాంబశివరావు, కె.రవికుమార్, ఎన్.రాజ్యలక్ష్మి, ఎం.శివ ఏపీఎస్ కుమారి, కళాధరి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

తాడేపల్లిరూరల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలో కార్మిక రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గురువారం సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తాడేపల్లిలో బైక్ ర్యాలీని బోసు బొమ్మ సెంటర్ నుంచి నెహ్రూ బొమ్మ సెంటర్ మీదుగా ఎమ్మార్వో కార్యాలయం, నులకపేట, ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల పోరాట శిబిరం వరకు సాగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తీసుకువచ్చి రైతులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేస్తామని చెప్పిన మాటలు ఆచరణకు నోచుకోవడం లేదన్నారు. ప్రజా ధనాన్ని కొల్లగొట్టి కార్పొరేట్‌లకు కట్టబెడుతోందని వ్యాఖ్యానించారు. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 26న జరగనున్న చలో గుంటూరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు, కార్మిక సంఘాల నాయకులు వేముల దుర్గారావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బూరగ వెంకటేశ్వర్లు, కె. కోటేశ్వరరావు, ఆదినారాయణ, కొట్టే కరుణాకర్‌రావు, కూరపాటి స్టీవెన్, వై. బర్నబాస్, బొబ్బిలి రామారావు, కె. బాబూరావు పాల్గొన్నారు.

జనగణనతో పాటే కులగణన చేయాలి



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

మంగళగిరి: జనగణనతో పాటు సమగ్ర కుల గణన జరపాలని ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఈ నెల 25న అన్ని జిల్లాల కలెక్టర్లకు విన్నవించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు తెలిపారు. గురువారం పట్టణంలోని జాతీయ రహదారి వెంట ఉన్న సంఘం కార్యాలయంలో ఈ మేరకు సమావేశం నిర్వహించారు. సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా అన్ని జిల్లా కార్యాలయంలో సంఘం ఆధ్వరంలో భారీ ర్యాలీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 2011లో ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ జనగణనతో కులగణన జరపాలని మాట్లాడి, ప్రస్తుతం మిన్నకుండిపోవడం దారుణమన్నారు. కులగణన వల్ల జాతీయ సమైక్యత దెబ్బతింటుందంటూ అసంబద్ధ ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు అన్నవరపు నాగమల్లేశ్వరరావు, పారేపల్లి మహేష్, మేక వెంకటేశ్వరరావు, శివరామ్ బాబాజీ, ఆలా శివాజీ, వరప్రసాద్, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో పద్యగాన పోటీలు

విజేతలకు ప్రశంసాపత్రం, జ్ఞాపిక, అర్హత పొందిన 90 మందికి అభినందన పత్రాలు

తెనాలి: ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో పద్యగాన పోటీలను నిర్వహిస్తున్నారు. మూడు వయసు విభాగాలతో పద్యగాన పోటీలను రెండు దఫాలుగా జరిపి, ప్రతి విభాగంలో ప్రథమ బహుమతిగా రూ.3,116, ద్వితీయ బహుమతిగా రూ.2,116, తృతీయ బహుమతిగా 1,116, ప్రతి విభాగంలో ముగ్గురికి ప్రోత్సాహక బహుమతిగా రూ.516 నగదును ఇస్తారు. విజేతలకు ప్రశంసాపత్రం, జ్ఞాపిక, అర్హత పొందిన 90 మందికి అభినందన పత్రం అందజేస్తామని ప్రకటించారు. 6–10 ఏళ్ల వయసుగల చిన్నారులను ప్రహ్లాద విభాగం, 11–15 ఏళ్ల వయస్కులకు మార్కండేయ విభాగంగా, 16–20 ఏళ్ల యువతీయువకులను వివేకానంద విభాగంగా నిర్ణయించారు. పోటీల్లో పాల్గొనేవారు ఏదైనా ఒక పద్యాన్ని రాగయుక్తంగా పాడిన వీడియోను పేరు, వయసు, తరగతి, ఊరు, ఫోన్ నెంబరుతో సహా చెప్పి ఈనెల 25వ తేదీలోగా డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరి (9247272066)కు వాట్సాప్‌లో పంపాలి. ప్రాథమిక పరిశీలనలో ఒక్కో విభాగంలో 30 మంది చొప్పున 90 మందిని ఎంపిక చేసి, ఈనెల 30న తెలియజేస్తారు. వీరంతా డిసెంబరు 9వ తేదీన గుంటూరులో జరిగే కార్యక్రమంలో ఒక్కొక్కరు మూడేసి పద్యాలను గానం చేయాల్సి వుంటుంది. ఒక్కొక్కరికి అయిదేసి నిముషాలు కేటాయిస్తారు. కావాల్సినవారు సంస్థ ఏర్పాటుచేసిన సహ వాయిద్యాలను ఉపయోగించుకోవచ్చునని వివరించారు.

వ్యర్థాలను పూర్తిగా తొలగించండి



సిబ్బందికి సూచనలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సూచించారు. పట్టణంలోని 16వ వార్డులో గురువారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కాల్వల్లో తీసిన వ్యర్థాలను వెంటనే బయటకు తరలించాలని సూచించారు. చెత్త రోడ్లపై లేకుండా చూడాలన్నారు. ఆమె వెంట ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఏఈ సూరిబాబు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ఆత్మరక్షణ విద్యల్లో శిక్షణ అవసరం



మాట్లాడుతున్న యువజన సర్వీసుల శాఖ మేనేజర్ బి.రాధిక

ఫిరంగిపురం: మహిళల ఆత్మరక్షణకు మెళకువలు ఎంతో అవసరమని యువజన సర్వీసుల శాఖ(స్టెప్)బి.రాధిక అన్నారు. మండల కేంద్రంలోని డాక్టర్ రంజన్‌బాబు కమ్యూనిటీ జూనియర్ కళాశాలలో గురువారం యువజన సర్వీసుల, పోలీసు శాఖల ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ, డ్రగ్స్ అబ్యూస్, ఈవ్ టీజింగ్, సెల్ఫ్ డిఫెన్స్, ఉమెన్ ట్రాఫికింగ్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ కళాశాలలో, పరిసరాలల్లో ఈవ్ టీజింగ్ పాల్పడటం ద్వారా సమాజంలో గౌరవాన్ని కోల్పోవాల్సి వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎండీ సుదర్శన్, ఏఎస్ఐ పీఏఖాన్, యువజన సర్వీసుల శాఖ సూపరింటెండెంట్ టి.శ్రీనివాసరావు, డి.జీవన్ మణిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత సిలిండర్ బుకింగ్‌లో ఇబ్బందులు



షేక్ సుభాని

తాడేపల్లిరూరల్ : దీపం–2 పథకం ఉచిత వంట గ్యాస్ సిలెండర్ బుకింగ్‌లో వినియోగదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. గురువారం దుగ్గిరాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచిత గ్యాస్ వినియోగదారులు ముందుగా నగదు చెల్లించి, సిలిండర్ తీసుకోవాలనడం సరికాదన్నారు. సిలిండర్ అందించిన 48 గంటల్లో రాయితీ వినియోగదారుని బ్యాంకు ఖాతాలో జమ అవుతుందన్న ప్రభుత్వం హామీ అమలులో సాధ్యం కావడం లేదన్నారు. నగదు చెల్లించి సిలిండర్ తీసుకుని 15 రోజులైనా ఇప్పటికీ చాలామంది లబ్ధిదారులకు నగదు జమ కాలేదన్నారు. పనులు మానుకుని గ్యాస్ ఏజెన్సీల వద్దకు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు.

24న మండలస్థాయి ఫుట్‌బాల్ టోర్నీ

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని మార్నింగ్ స్టార్ కళాశాల గ్రౌండ్‌లో ఈ నెల 24 ఆదివారం మండల స్థాయి అండర్ ఫుట్‌బాల్ లీగ్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సెక్రటరీ వంగిపురపు శ్రీనివాసరావు గురువారం తెలిపారు. గుంటూరు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. మండలస్థాయి నుంచి ఎక్కువ మంది యువ క్రీడాకారులను తయారు చేయడం కోసం ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల జట్లు తమ దరఖాస్తులను అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నానికి అందజేయాలని తెలిపారు.







సెలైన్ ఒకరు పట్టుకోగా.. రోగిని తీసుకెళ్తున్న కుటుంబ సభ్యులు | వైద్యసేవలు అందాలంటే నెట్టుకెళ్లాల్సిందే... | ఎవరన్నా వచ్చి చేయి వేసేవరకు ఆగాల్సిందే..

రావడం వీల్ కాదు!

తెనాలి ప్రభుత్వ ఆస్పత్రిలో రోగుల వీల్‌చైర్ కష్టాలు

తెనాలి ప్రభుత్వ ఆసుపత్రి.. హోదాకు మాత్రమే జిల్లాస్థాయి. భవనాలు, ఆపరేషను థియేటర్లు, ప్రసూతి విభాగం సహా అన్నివిభాగాలు, వైద్యపరికరాలు...అన్నీ ఉన్నాయి. కానీ పోస్టులు మాత్రం పెరగటం లేదు. దీంతో రోగుల పరిస్థితి ఇలా ఉంది.. అనారోగ్యంతో నడవలేని స్థితిలో ఉన్న రోగులను ఎక్స్‌రే, స్కానింగ్, రక్తపరీక్షలకు తీసుకెళ్లాలంటే వీల్‌చైర్లే శరణ్యం. ఆసుపత్రి సిబ్బంది లేక పోవటంతో రోగిని వీల్‌చైర్‌లో కూర్చోబెట్టుకుని కుటుంబసభ్యులే తోసుకెళ్లాల్సిన దుస్థితి. సెలైన్ పెట్టిన రోగినైనా సరే, ఒకరు వీల్‌చైర్ తోస్తుంటే, మరొకరు సెలైన్ పెట్టుకుని తీసుకెళుతున్నారు. ఆసుపత్రికి వచ్చే ఔట్ పేషెంట్లు, చికిత్స పొందుతున్న ఇన్‌పేషెంట్లు ఎవరైనా సరే, కుటుంబ సభ్యులు, బంధువుల సహకారం లేకపోతే ఇబ్బందులు అనివార్యం.

– తెనాలి